క్లుప్తంగా

కేజీహెచ్‌లో చిన్నారులకు అరకు ఎమ్మెల్యే పరామర్శ



పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న మత్స్యలింగం

మహారాణిపేట: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంకైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో ఆహారం కలుషితమై అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన ట్రస్ట్ (పాసా) చిన్నారులను గురువారం అరకు నియోజకవర్గ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పరామర్శించారు. డాక్టర్ అశోక్‌తో కలిసి ఆశ్రమ చిన్నారులు చికిత్స పొందుతున్న చిన్న పిల్లల వార్డులో పర్యటించారు. ప్రతి చిన్నారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ప్రతి చిన్నారికి ధైర్యం చెప్పారు. పిల్లలు త్వరితగతిన కోలుకునేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానందంకు ఎమ్మెల్యే మత్స్యలింగం సూచించారు.

మతిస్థిమితం లేని యువతికి ఆశ్రయం



ఏయూటీడీ వసతి గృహంలో ఆశ్రయం పొందిన యువతి

సీతమ్మధార: పేరు, ఊరు పేరు చెప్పలేని నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక యువతిని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేని ఒక యువతిని గుర్తించిన వ్యక్తులు ద్వారకానగర్ టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ–ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి గురువారం తరలించారు. గతంలో కూడా ఈమెకు ఇక్కడ ఆశ్రయం కల్పించగా.. పారిపోయిందని నిర్వాహకులు తెలిపారు. ఈమె ఇతరులను దుర్భాషలాడుతోందని, కొన్ని రోజులు యువతి పరిస్థితి గమనించి చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి తరలిస్తామని ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు. యువతిని గృహానికి అప్పగించిన వారిలో హరి తదితరులు ఉన్నారు.

కనకమహాలక్ష్మి అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న కనకవలస నాగభూషణరావు, సుధారాణి దంపతులు

అల్లిపురం: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి విశాఖకు చెందిన కనకవలస నాగభూషణరావు, సుధారాణి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళాన్ని గురువారం అందజేశారు. దాతలకు ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వి.రాంబాబు అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఆశీలుమెట్ట సెక్షన్ ఆఫీసు పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు టీపీటీ కాలనీ, డాక్టర్ గణేష్‌బాబు ఆస్పత్రి, హిందూ ప్రెస్ కార్యాలయం, ఎన్‌బీఎం న్యాయ కళాశాల, సీతంపేట దుర్గాగణపతి ఆలయం, విజయ మెడికల్ ఏరియా, సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

చెవుల్లో రణభేరి



- నగరంలో పెరుగుతున్న శబ్ద కాలుష్యం
- పరిమితికి మించి వెలువడుతున్న శబ్దాలు
- నియంత్రించకపోతే ముప్పే..



చెవులు గుయ్‌మనిపిస్తూ దూసుకెళ్తున్న వాహనాలు

డాబాగార్డెన్స్: నగరంలో శబ్ద కాలుష్యం తీవ్రత పెరుగుతోంది. ఒకప్పుడు పగటి పూట మాత్రమే పరిమితమైన వాణిజ్య కార్యకలాపాలతో శబ్దాలు వినిపించగా.. ఇప్పుడు సమయంతో పనిలేకుండా రణగొణ ధ్వనులు చెవుల్లో చిల్లులు పొడుస్తున్నాయి. కాలం చెల్లిన వాహనాల కర్ణ కఠోర శబ్దాలు.. నిర్మాణ సంబంధ యంత్రాల రణగొణ ధ్వనులు.. పరిశ్రమల్లోని భారీ యంత్ర పరికరాల చప్పుళ్లు.. ట్రాఫిక్ జామ్‌లో హారన్ల మోత.. నివాస ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు.. డీజేలు, బ్యాండ్ బాజాలు, బాణసంచా మోతలు వెరసి నగర వాసి



ట్రాఫిక్ జామ్‌తో హారన్ల మోత

గూబ గుయ్ మనిపిస్తున్నాయి.

అధిక శబ్దం.. ఆరోగ్యానికి హానికరం

వినికిడి అవధిని దాటి అధికంగా వెలువడే శబ్దాలను ధ్వని కాలుష్యంగా పరిగణిస్తారు. శబ్ద కాలుష్యం పరిమితిని మించి నమోదైతే ప్రజల చెవుల్లో రింగు రింగు మంటూ శబ్దాలు వస్తాయి. దీర్ఘకాలం విన్న వారికి శాశ్వత వినికిడి లోపం, నిద్ర లేమి, అలసట, హృదయ రక్తనాళాల సంబంధ వ్యాధులు సంక్రమిస్తాయి. రక్తపోటు పెరిగిపోతుంది. చేసే పనిమీద ఆసక్తిని కోల్పోతారు. నవజాత శిశువులు 90 డెసిబుల్ దాటిన శబ్దాలు వింటే వినికిడి శక్తి కోల్పోతారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వారి గుండె కొట్టుకునే వేగం పెరిగి ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. 90 డెసిబుల్స్ మించిన శబ్దాలు విన్నప్పుడు కొందరికి తాత్కాలిక చెవుడు, మరికొందరికి దీర్ఘకాలిక చెవుడు వచ్చే ప్రమాదముంది. చిన్నపిల్లల కర్ణభేరిలోని సూక్ష్మనాడులు దెబ్బతింటాయి. వృద్ధులకు శాశ్వత చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. అత్యధిక ధ్వనులు విన్నప్పుడు చిన్నపిల్లలు మెదడుపై దుష్ప్రభావం పడుతుంది. వారిలో చురుకుదనం లోపించి బుద్ధిమాంద్యం సంభవిస్తుంది. చదువుల్లోనూ వెనుకబడతారు.

సమస్య నుంచి బయట పడాలంటే..

ప్రధానంగా పాఠశాలలు, ఆస్పత్రుల వద్ద అధిక శబ్దాలను నిరోధించే జిప్సం బోర్డులు, ఫైబర్‌గ్లాస్‌తో గోడలను కప్పివేయాలి. అధిక శబ్దాలు వెలువడే ప్రాంతాల్లోని భవనాలకు విధిగా శబ్ద గ్రాహకాలు ఏర్పాటు చేయాలి. ప్రతి ఆస్పత్రి, పాఠశాలలో గ్రీన్‌బెల్ట్‌ను అధికంగా ఏర్పాటు చేయాలి. అధిక శబ్దాలు గ్రహించేందుకు హరిత వాతావరణం దోహదం చేస్తుందని గుర్తించాలి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదిక ప్రకారం ఏ వ్యక్తి అయినా 8 గంటల పాటు 85 డెసిబుల్స్‌కు మించిన శబ్దం వినకుండా జాగ్రత్తలు పాటించాలి. అత్యధిక శబ్దాలు వినిపించే ప్రాంతాల్లో హియర్ ప్లగ్‌లు వాడాలి. ట్రాఫిక్ రద్దీతో బయటకి వెళ్లేటప్పుడు హెల్మెట్‌లు, చెవుల్లో దూది పెట్టుకోవాలి.

జంతువులకు ప్రమాదమే..

కుక్క, పిల్లి వంటి పెంపుడు జంతువులు 50 డెసిబుల్స్ దాటిన శబ్దాలను వింటే విపరీతంగా ప్రవర్తిస్తాయని వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. కొన్ని సార్లు వాటి కర్ణభేరి బద్దలయ్యే ప్రమాదముంటుంది. అతిధ్వనులు విన్న జంతువులు ఇంటి నుంచి పరుగెత్తి రోడ్డు ప్రమాదాల బారిన పడటం, కరవడం తదితర విధంగా ప్రవర్తిస్తాయి.

శబ్ద కాలుష్య కారణాలు

- నగరంలో మొత్తం వాహనాల సంఖ్య 50 లక్షలకు పైమాటే. వీటిలో 15 ఏళ్లకు మించి కాలం చెల్లినవి లక్షల్లో ఉన్నాయి. వీటి ఇంజిన్ల నుంచి పెద్ద ఎత్తున శబ్దాలు వెలువడుతున్నాయి. నగరంలో యూత్ ముఖ్యంగా తమ బైక్‌లకు అధిక శబ్దాలు వెలువడే మోడిఫైడ్ హారన్లను వినియోగించడం కూడా శ్రుతి మించుతుండటంతో శబ్ద కాలుష్యం పెరుగుతోంది.
- నగరంలో ప్రధాన రహదారులపై సుమారు 100 ముఖ్యమైన ట్రాఫిక్ జంక్షన్లు ఉన్నాయి. వీటి వద్ద అధిక సమయం వాహనాలు నిలపాల్సి రావడంతో హారన్ల మోత మోగుతోంది. నివాస ప్రాంతాలకు ఆనుకుని ఫంక్షన్ హాళ్లు, క్లబ్‌లు, పబ్బులు ఏర్పాటు చేయడంతో వీటి వద్ద డీజేల హోరు, బ్యాండ్ బాజాల మోతతో గూబ పగలిపోతుంది. ముఖ్యంగా జగదాంబ జంక్షన్, పూర్ణా మార్కెట్, డాబాగార్డెన్స్, అల్లిపురం, రైల్వే స్టేషన్ రోడ్డు, దొండపర్తి, అక్కయ్యపాలెం, పెదవాల్తేర్.. ఇలా ప్రతి జంక్షన్‌లోనూ ధ్వని కాలుష్యం మోత అధికంగా ఉంటుంది.

ప్రజల్లో అవగాహన పెరగాలి



నగరంలో శబ్ద కాలుష్యం బాగా పెరుగుతోంది. కొన్నేళ్లుగా టూరిస్టుల సంఖ్యతో పాటు వాహనాల కొనుగోళ్లు పెరిగాయి. ఫోర్‌వీల్స్‌తోపాటు త్రీ వీలర్స్ వాహనాలు అధికమయ్యాయి. వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల శబ్ద కాలుష్యం పెరుగుతోంది. ప్రతి పౌరుడు శబ్ద కాలుష్యం నియంత్రణకు ఉద్యమంలా సిద్ధపడినప్పుడే దీన్ని నియంత్రించగలం.

– సారిక దైవకుమార్, రెల్లివీధి

18వ రోజుకు శ్రావణలక్ష్మీ పూజలు



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి



విశేష హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

డాబాగార్డెన్స్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు గురువారం నాటికి 18వ రోజుకు చేరాయి. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మీ పూజలు ప్రారంభించారు. విశేష పూజలు, హోమం, పంచామృతాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పరోక్షంగా పూజలు చేయదలచుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081కు జమచేసి వారి పేరు, గోత్రనామం, చిరునామాను 89855 15989కు వాట్సాప్ చేయాలి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేకం

కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరగనున్న ఈ పూజలో రూ.500 చెల్లించిన దంపతులు లేదా ఇద్దరు భక్తులు పాల్గొనవచ్చు. భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలి.

విద్యార్థుల్లో ప్రతిభకు ప్రోత్సాహం



ప్రతిభా పోటీల విజేతలతో ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ, అతిథులు

కంచరపాలెం: విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలును ప్రోత్సహించే దిశగా జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల పనిచేస్తోందని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాస రచన, కథా వాచనం మొదలగు ప్రతిభా పోటీలు నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రమాణపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షైజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడంతోపాటు ప్రతిభను ప్రదర్శించడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. సుమారు 10 కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వి.ఎస్.కృష్ణ, డాక్టర్ పి.కె.జె.లక్ష్మి, పి.రమణిలత, వసంత, సరోజకుమారి, కో–ఆర్డినేటర్లు జోషిత, దీపిక, నవ్యశ్రీ, రమ్యసాయి, చంద్రిక, డాక్టర్ టి.భాస్కరసుధ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి



వివరాలు వెల్లడిస్తున్న నూతన దంపతులు వినీత, వెంకటేష్

అల్లిపురం: తనకు నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకుంటే తన తండ్రి, బాబాయిలు వ్యతిరేకించి అడ్డుపడుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని విజయనగరం జిల్లా రాజాంకు చెందిన వినీత అనే నవవధువు కోరింది. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించింది. విశాఖపట్నం కృష్ణాపురానికి చెందిన తనకు మామయ్య వరసైన వెంకటేష్‌ను 8 ఏళ్లుగా ప్రేమిస్తున్నానని వినీత తెలిపింది. తమ వివాహానికి తన తండ్రి గోవింద ఒప్పుకోకపోగా.. వేరే వ్యక్తితో పెళ్లికి ఏర్పాటు చేయడంతో తన తల్లి కుమారితో కలిసి ఇంటి నుంచి పారిపోయి విశాఖలో మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మను ఆశ్రయించానని చెప్పింది. వెంకటేష్, తాను మేజర్లు కావడంతో ఆమె తమకు గురువారం వివాహం జరిపించి, రక్షణ కల్పించారని పేర్కొంది. తాము పెళ్లి చేసుకోవడంతో తన తండ్రి అతడి సోదరుడు తామాడ భగవాన్‌తో కలిసి తనను, తన తల్లిని, భర్తను బెదిరిస్తున్నారని ఆరోపించింది. ఈమేరకు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని నూతన దంపతులు కోరారు. సమావేశంలో మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతను అలవాటు చేద్దాం



గోపాలపట్నం హైస్కూల్‌లో బ్యానర్ ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపట్నం : చేతులు శుభ్రం చేసుకునేలా విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని ఎంఈవో దివాకర్ సూచించారు. ఈ మేరకు గురువారం గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతుల ద్వారా వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థులు చేతులు శుభ్రంగా కడుక్కునేలా చిన్ననాటి నుంచే అలవాటు చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో ఎంపిక చేసిన 100 పాఠశాలల్లో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా నినాదంతో పత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆటలు, టాయిలెట్లకు వెళ్లి వచ్చిన తర్వాత విధిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ప్రత్యేకంగా రూపొందించిన మెటీరియల్స్‌తో అవగాహన కల్పించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో ప్రపంచ వాష్ డే, ప్రపంచ టాయిలెట్ డేను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కె.నాగంద్ర జోగి, డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రతినిధులు ఏఎస్ కుమారి, ఎం.పుల్లన్న, గోడె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో నాలుగు రోజుల పాటు శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు. ఈ వేడుకలు 24వ తేదీ శనివారం నుంచి 27 వరకు జరుగుతాయని చెప్పారు. ఈ నాలుగు రోజులు శ్రీ కృష్ణుడికి ప్రత్యేక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, 26న కృష్ణాష్టమి సందర్భంగా వేకువజామున మంగళ హారతి, దర్శన హారతి, అఖండ హరినామ సంకీర్తన చేపడుతున్నామని తెలిపారు.

గ్రంథాలయాలతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న విద్యా శాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

సీతమ్మధార: విశాఖపట్నం అభివృద్ధిలో గ్రంథాలయాలూ ముఖ్యమేనని విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి మీద అత్యంత ప్రధానమైనది గ్రంథాలయమన్నారు. ఇక్కడికి ఎన్నిసార్లు వెళ్తే అన్ని కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత గ్రంథాలయానికి వెళ్లడం మానేయడం సరికాదని హితవు పలికారు. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు పాత పేపర్లు సాధన చేయడం ద్వారా విజయం సాధించవచ్చని సూచించారు. పౌర గ్రంథాలయంలో ఎన్నో వేల గ్రంథాలు, మంచి సదుపాయాలున్నాయని నిర్వాహకులను అభినందించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సహాయ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం బలవంతపు ఆర్థిక ఆంక్షలు ఉపసంహరించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల పట్ల అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేతకాని వైఖరి వల్ల పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడపలేకపోతున్నారన్నారు. ముడి పదార్థాలు సమకూర్చలేని పరిస్థితిలో యాజమాన్యం ఉండడం సిగ్గుచేటన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే ప్లాంట్ మనుగడ సాధిస్తుందన్నారు. అదే విధంగా నిర్వాసితుల ఉపాధి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. సెయిల్‌తో సమానంగా వేతన సవరణ జరగాల్సి ఉండగా ఇక్కడ ఉన్న వేతనాలపై ఆంక్షలు విధించాలని చూడడం దుర్మార్గమన్నారు. ఉక్కు యాజమాన్యం ప్రతీ నెలా సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు ఆర్థిక ఆంక్షల ప్రతిపాదనను విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

సాగరతీరాన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



జోడుగుళ్లపాలెం తీరంలో వ్యక్తి మృతదేహం

బీచ్‌రోడ్డు: జోడుగుళ్లపాలెం సాగరతీరం వద్ద గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఆరిలోవ పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి 50 ఏళ్ల వయసు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు.

25న ప్రాథమిక విద్యపై సదస్సు

మద్దిలపాలెం: ప్రాథమిక విద్య మాతృభాషలో కొనసాగించాలని కోరుతూ ఈ నెల 25న బుల్లయ్య కళాశాలలో సదస్సు నిర్వహిస్తున్నామని రైట్ టూ ఎడ్యుకేషన్ ఫోరం ప్రతినిధి ఎస్.ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు కళాశాలలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌ ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. సదస్సులో అందరూ పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపాలని ఆయన కోరారు.

ఫార్మా మరణాలు.. ప్రభుత్వ హత్యలే!



మార్చురీ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న న్యూ సోషలిస్ట్ ప్రాక్సిస్ నాయకులు

మహారాణిపేట: అచ్యుతాపురం ఫార్మా ప్రమాదంలో జరిగిన మరణాలు ప్రభుత్వ హత్యలేనని న్యూ సోషలిస్ట్ ప్రాక్సిస్ నాయకులు ఆరోపించారు. కేజీహెచ్‌లో మార్చురీ వద్ద ఒకవైపు ప్రమాద మృతులకు పోస్ట్‌మార్టమ్ నిర్వహిస్తుండగా.. మరోవైపు న్యూ సోషలిస్టు ప్రాక్సిస్ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వచ్చిన సమయంలో మార్చురీ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ప్రమాదానికి కారణమైన కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

రూ.2 కోట్ల చొప్పున పరిహారమివ్వాలి



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

మహారాణిపేట: అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.2 కోట్ల చొప్పున పరిహారం అందజేయాలని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీహెచ్ మార్చురీ వద్ద కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, ఇతర నాయకులతో కలిసి ఆమె గురువారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎస్.సుధాకర్, ప్రియాంక దండి పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న బ్యాంక్ మహిళా ఉద్యోగులు

డాబాగార్డెన్స్: పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత లేకుండా పోతోందని, మహిళల భద్రతకు తక్షణం ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి నగరంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్భయ చట్టం ఉన్నప్పటికీ మహిళలపై ఇటువంటి దాడులు జరగడం హేయనీయమన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్తులో మహిళలపై దాడులు నిరోధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ సంఘం నాయకులు కమలాకర్, ఆదారి శ్రీను, రమేష్, ఈశ్వర్, ప్రసాద్, సుజాత, ప్రత్యూష, ప్రసన్న లక్ష్మి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలే విద్యార్థుల లక్ష్యం

పాపా హోమ్ చిన్నారులతో సివిల్స్ ర్యాంకర్ పూసపాటి సాహితి



పాపా హోమ్‌లో పిల్లలతో ముచ్చటిస్తున్న సాహితి



సివిల్స్ 24వ ర్యాంకర్ సాహితిని సత్కరిస్తున్న పాపా హోమ్ కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్: సివిల్స్ ఐఎఫ్‌ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో 24వ ర్యాంక్ సాధించిన పూసపాటి సాహితి గురువారం పాపా హోమ్‌ను సందర్శించారు. అక్కడి పిల్లలతో కాసేపు ముచ్చటించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, చక్కటి ప్రణాళికలతో ముందుకు వెళ్లి బంగారు భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఇతర విషయాలు పక్కన పెట్టి కష్టపడి చదివితే అత్యున్నత శిఖరాలు చేరుకోగలరని సూచించారు. పాపా హోమ్ విద్యార్థుల కోసం రూ.10 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు సాహితి అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఏ విషయంలోనైనా తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా సాహితిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. పాపా హోం ఉపాధ్యక్షుడు పంపాన వేంకటేశ్వరరావు, కార్యదర్శి వి.ఎస్.ప్రకాశరావు, సభ్యుడు పి.భాస్కర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.